# నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

11 | హైదరాబాద్, సోమవారం 12 ఫిబ్రవరి 2024 | SANGAREDDY


## సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఎంపీడీవోల బదిలీ

సంగారెడ్డి, ఫిబ్రవరి11: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం జిల్లాలో మం డల అభివృద్ధి అధికారులను బదిలీ చేసింది. సంగారెడ్డి జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన ఎంపీడీవోలు బదిలీ చేసిన జిల్లాలో కలెక్టర్‌కు రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ ఈనెల 13లోగా పూర్తి కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. జిల్లాలో పని చేస్తున్న 27మంది అధికారుల్లో 20 మందిని వివిధ జిల్లాలకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో ఎంపీడీవోలు జయలక్ష్మి, మల్లేశ్వర్, రవీందర్, రాములు, సుజాతానాయక్, సుమతి, విశ్వప్రసాద్, పూజ, వెంకటేశం, చంద్రశేఖర్, షాజీలోద్దీన్, మంజుల, మధులత, కే.సుజాత, సి.సుజాత, ముజాఫరుద్దీన్, బన్సీలాల్, శారదాదేవి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

**మెదక్‌లో 13 మంది..**

మెదక్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో 13 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. ఆర్.మార్టిన్‌లూథర్, జి.గణేశ్‌రెడ్డి, ఎం.వెంకటలక్ష్మమ్మ, జి.శ్రీరాములు (సిద్దిపేట), సీహెచ్ అరుంధతి (రంగారెడ్డి), కె.ప్రవీణ్ (నిజామాబాద్), డి.ఉమాదేవి, పి.శ్రీనివాస్, ఈ.యాదగిరిరెడ్డి, సీహెచ్.ఆనందమేరి, ఎ.శశిప్రభ, వి.శ్రీరాం, ఎన్.భారతీ సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.



మల్లన్న ఆలయ ప్రాంగణంలోని గంగరేగు చెట్టు వద్ద భక్తుల మొక్కులు



## హామీలు విస్మరించిన కాంగ్రెస్ సర్కారు

- బీఆర్ఎస్ హయాంలో 13 లక్షల మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్
- రూ. 12వేల కోట్ల సాయం
- తులం బంగారం పథకానికి బడ్జెట్‌లో నిధులేవీ..
- రెండు నెలలుగా వృద్ధులకు ఆసరా పింఛన్లు రావడం లేదు..
- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేటలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 11: అధికారంలోకి వస్తే ఆడబిడ్డల పెండ్లికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు లక్షా నూటపదహారు రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే కాంగ్రెస్ మాట మార్చిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఆదివారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెండ్లికి అండగా ఉండేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కల్యాణక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేసిందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలోని 13 లక్షల పేదింటి ఆడపిల్లల పెండ్లిలకు రూ. 12 వేల కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. వృద్ధులకు ఆసరా కింద రూ.4 వేల చొప్పున పింఛన్ అందిస్తామని చెప్పి అమలు చేయడం లేదన్నారు. జనవరి, ఫిబ్రవరికి సంబంధించిన రూ. 2 వేల చొప్పున పింఛన్ ఇంతవరకు ఇవ్వలేదన్నారు. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందిస్తామని చెప్పి, కనీసం 16 గంటలు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని,దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని హరీశ్‌రావు చెప్పారు. కార్యక్రమంలో రాజనర్సు, రవీందర్‌రెడ్డి, పాల సాయిరాం, జాప శ్రీకాంత్‌రెడ్డి, కోల రమేశ్‌గౌడ్, కౌన్సిలర్ గ్యాదరి రవీందర్, బీఆర్ఎస్ నాయకులు మోయిజ్, రెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సిద్దిపేటలో హజ్ యాత్రకు వెళ్తున్న వారిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

## మైనార్టీలకు మొండిచేయి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 11 : ఎన్నికల్లో మైనార్టీలకు పెద్దపీట వేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లోనే మొండిచేయి చూపిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని హజ్‌హౌస్‌లో ఉమ్రా యాత్రకు వెళ్తున్న పది మంది యువకులను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు ప్రవేశపెడతామని చెప్పి, రూ.2,200 కోట్లు ప్రవేశపెట్టి కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందన్నారు. అల్లా దయతో ఉమ్రా యాత్రను సంతోషంగా ముగించుకొని రావాలన్నారు. పేదలు ఉమ్రా యాత్రకు వెళ్లేందుకు ఏటా సొంత ఖర్చులతో పదిమందిని ఎంపిక చేసి పంపిస్తున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ తర్వాత సిద్దిపేటలోనే హజ్‌హౌస్‌ను అన్నిహంగులతో నిర్మించుకున్నట్లు తెలిపారు. అన్నివేళలా మీకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజనర్సు, కొండం సంపత్‌రెడ్డి, పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, యోయిజ్, జావెద్ పాల్గొన్నారు.

## ఆలయాలకు నిధులివ్వని కాంగ్రెస్

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ ప్రభుత్వం అర్చకులకు కనీసం జీతాలు ఇవ్వడం లేదని, రూ.12 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు బండ స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణ మండపంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రూ.3 కోట్లతో ఆలయ అభివృద్ధికి వివిధ పనులు చేశామన్నారు. ఆలయానికి భక్తులు వచ్చేందుకు రూ.35 లక్షలతో రోడ్డు , రూ.35 లక్షల టీటీడీ నిధులతో దేవాలయ అభివృద్ధి పనులు,రూ.10 లక్షలతో దేవాలయం చుట్టూ షెడ్ నిర్మించామని తెలిపారు. బండపై తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడం కోసం రూ.80 లక్షలతో, మిషన్ భగీరథ పథకంలో భాగంగా లక్షా 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకును నిర్మించామని తెలిపారు. రూ.50 లక్షలతో కల్యాణమండపం, ఆలయం సమీపంలో భక్తులు సేదతీరేందుకు సుడా ఆధ్వర్యంలో రూ.20 లక్షలతో పార్కు నిర్మాణం చేయించామని, మరో రూ.8 లక్షలతో మినీట్యాంకులు, పైప్‌లైన్లు, నల్లాలు ఏర్పాటు చేయించామని, సీసీ రోడ్డు గుండా రూ.10 లక్షలతో విద్యుత్ స్తంభాలు, పుల్లూరు స్టేజీ వద్ద సుమారు రూ.15 లక్షలతో దేవాలయ స్వాగత తోరణం, మరో రూ.50 లక్షలు మంజూరు చేయించామని, వాటితో భక్తులకోసం ధర్మశాలలు నిర్మిస్తామని తెలిపారు. పుల్లూరు మీదుగా రింగ్‌రోడ్డు వేసుకున్నామని, దీనికి అనుసంధానంగా డబుల్‌రోడ్డు పనులు సాగుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. బండచెర్లపల్లి చెరువుకు నీళ్లు రానున్నాయని, పుల్లూరు, వెంకటయ్యకుంట చెరువులు నింపుతామని, కాళేశ్వరం జలాలు రెండు పంటలు పండుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన 2500 ఆలయాలకు, సిద్దిపేట జిల్లాలోని 171 ఆలయాల అర్చకులకు జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీనిపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తానన్నారు. పుల్లూరు బండ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్యగౌడ్, మాజీ చైర్మన్ కలకుంట్ల రంగాచార్యులు, ఆలయ కమిటీ డైరెక్టర్లు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవీరాంచందర్‌రావు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ పల్లె నరేశ్‌గౌడ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



కల్యాణమండపంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

## జన జాతర

**కొనసాగుతున్న కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు**
**నాలుగో ఆదివారం 35 వేల మంది భక్తుల దర్శనం**
**మొక్కులు చెల్లించిన భక్తజనం**

చేర్యాల, ఫిబ్రవరి 11 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల నాలుగో ఆదివారానికి 35వేల మంది భక్తులు వచ్చారు. భక్తులు పోటెత్తడంతో గదులన్నీ నిండిపోయాయి. పుణ్యస్నానాల అనంతరం భక్తులు క్యూలైన్లలో గంటలపాటు వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమర్పించారు. పట్నాలు వేశారు. గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టారు. సంతానం కలగాలని ఒల్లుబండ పూజలు, రాతిగీరల వద్ద మొక్కులు, కోడెను కట్టి స్వామివారిని వేడుకున్నారు. ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఏఈవో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.





కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

### ఓపెన్ షవర్ల వద్ద ఇబ్బందులు...

మల్లన్న క్షేత్రంలో ఆలయవర్గాలు ఏర్పాటు చేసిన ఓపెన్ షవర్ల వద్ద స్నానాలకు మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. అన్నప్రసాద వితరణశాల, పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఓపెన్ షవర్ల వద్ద స్నానాలు చేసేందుకు అనువుగా ఉన్నప్పటికీ షవర్ల చుట్టూ తడకలు లేదా వస్త్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు ఇబ్బందిగా ఫీలవుతున్నారు.

### ప్రధాన రహదారిపై నిలిచిపోయిన ట్రాఫిక్

చేర్యాల నుంచి కొమురవెల్లి మీదుగా ఐనాపూర్ నుంచి రాజీవ్ రహదారి మీదుగా హైదరాబాద్ వెళ్లే కొమురవెల్లి ప్రధాన రహదారిపై ఆదివారం భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. పోలీస్‌శాఖ సూచనలు చేసినప్పటికీ భక్తులు రోడ్లపై ఇష్టారాజ్యంగా వాహనాలు నిలిపి దర్శనానికి వెళ్లారు. దీంతో గంటపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పోలీసులు వచ్చి క్లియర్ చేశారు.



ఆలయ ప్రధాన వీధిలో భక్తుల రద్దీ

### పాస్‌ల జారీ కఠినతరం

కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో దర్శనం పాస్‌ల జారీ ప్రక్రియను ఆలయవర్గాలు కఠినతరం చేశాయి. ఆలయ ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి దీనిపై ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు తదితరులతో చర్చించి పాస్‌లు దుర్వినియోగం కాకుండా చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇక నుంచి వీవీఐపీ, వీఐపీ, డోనర్, అధికారులు, ఆలయవర్గాలు, కమిటీ సభ్యుల్లో ఎవరు పాస్ తీసుకుంటున్నారు, ఎంత మంది ఆ పాస్‌పై దర్శనానికి వెళ్తున్నారనే వివరాలను పాస్‌తోపాటు రిజిస్టర్‌లో వారి పేరుతో నమోదు చేస్తున్నారు. దర్శనం పాసుల జారీ ప్రక్రియ కఠినతరం కావడంతో కౌంటర్ వద్ద రద్దీ లేకుండా పోయింది.

## విజేతలను అభినందించిన హరీశ్‌రావు



సిద్దిపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 11: సిద్దిపేట జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీల విజేతలను మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు. సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన విజేతలకు చెక్కులు, మెడల్స్, జ్ఞాపికలు అందజేశారు. సూర్య నమస్కారాల పోటీల్లో రికార్డ్ బ్రేక్ చేసిన వారితో ముచ్చటించారు. పోటీల్లో అద్భుత ప్రతిభ కనబర్చిన పిల్లలను ఆశీర్వదించారు. జాతీయస్థాయిలో రాణించాలని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహక ప్రతినిధులు తోట సతీశ్, సంధ్య, కె.అంజయ్య, తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, చిప్ప ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడుపాయల్లో భక్తుల సందడి



పూజలు అందుకుంటున్న వన దుర్గామాత

పాపన్నపేట, ఫిబ్రవరి11: ఏడుపాయల వనదుర్గా భవానీ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏడుపాయల చైర్మన్ సతెల్లి బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవివీర్ కుమార్, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్, యాదగిరి ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకర శర్మ, పార్థీవ శర్మ, మురళీధర్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, పాపన్నపేట ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు.

### అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

ఏడుపాయల వన దుర్గామాతను దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు దర్శించుకున్నారు. ఆయనకు పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది మాజీ ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో సత్కరించారు.



క్యూలైన్లో భక్తుల సందడి

## భారతీయ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి

సిద్దిపేట, ఫిబ్రవరి 11: గురుపరంపర, సంస్కృతీ సంప్రదాయాలతో ప్రపంచంపై భారత్ చెరగని ముద్ర వేస్తున్నదని పతంజలి యోగా పీఠాధికారి స్వామి యజ్ఞదేవ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేట బాలికల పాఠశాల గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. యోగా, ధ్యానం, ప్రాణాయామం మొదలగు విద్యలు దేశాన్ని సుసంపన్నం చేశాయన్నారు. గురువుల మార్గదర్శనంలో సమాజం వికసిస్తుందన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు భారతీయ సంస్కృతిలో సమాధానాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భారత రాజ్య సంఘటన మంత్రి నందనం కృపాకర్ మాట్లాడుతూ యోగా అద్భుతమైతే, సూర్య నమస్కారాలు శ్రేష్ఠమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మంజులా రాజనర్సు, సిద్దిపేట స్పోర్ట్స్ అథారిటీ కన్వీనర్ పాల సాయిరాం, సుడా పూర్వ డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, జాతీయ యోగా మెడలిస్ట్, శిక్షకుడు తోట సతీశ్, సంధ్య యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామిరెడ్డి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, గౌరవాధ్యక్షుడు అంజయ్య ,ఉత్సవ కమిటీ కన్వీనర్లు చిప్ప ప్రభాకర్, రాజ్ కుమార్, గంగపురం శ్రీనివాస్, డాక్టర్ అరవింద్, సిరి చిల్డ్రన్స్ దవాఖాన డాక్టర్ సాయి, జవాన్ గార్డింగ్ సర్వీస్ సతీశ్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



సూర్య నమస్కారాలు చేస్తున్న యోగా విద్యార్థులు

## సింగూరు ప్రాజెక్టును సందర్శించిన ఉన్నతాధికారి



ప్రాజెక్టు దిగువ భాగాన ఉన్న బోటులో ప్రయాణిస్తున్న శశాంక్ గోయల్

పుల్కల్, ఫిబ్రవరి 11: సంగారెడ్డి జిల్లా బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టును ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్, తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశాంక్ గోయల్ సందర్శించారు.ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలు నీటి పారుదల శాఖ అధికారులు ఆయనకు వివరించారు.అనంతరం ప్రాజెక్టు దిగువ బాగాన ఉన్న బోటులో కొద్దిసేపు ప్రయాణించారు. ఆయన వెంట ఆర్డీవో పాండు, తహసీల్దార్ భాస్కర్ కుమార్, డిప్యూటీ డీఈ నాగరాజు, జేఈఈ మహిపాల్‌రెడ్డి, ఆర్ఐ మహాదేవ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## సిద్దిపేట అభివృద్ధి అదుర్స్

సిద్దిపేట కమాన్, ఫిబ్రవరి 11: సిద్దిపేట స్వచ్ఛ బడి బాగుందని, అక్కడ అనేక విషయాలు తెలుసుకున్నామని కేంద్ర అధికారుల బృందం కితాబిచ్చింది. సిద్దిపేట జిల్లాలో ఐదు రోజులుగా పర్యటిస్తున్న సెంట్రల్ సెక్రటేరియట్ సెక్షన్ ఆఫీసర్స్ 14 మందితో కూడిన బృందం చివరి రోజు ఆదివారం సిద్దిపేట పట్టణంలో పర్యటించారు. వారికి సిద్దిపేట స్వచ్ఛ బడిలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం, స్వచ్ఛ బడి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సివియేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్‌టీటీ), బుస్సాపూర్ డంపింగ్ యార్డ్, డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ)ను సందర్శించారు. మున్సిపల్ అడిషనల్ కమిషనర్ మల్లికార్జున్ సిద్దిపేట స్వచ్ఛ బడి వివరాలు ప్రొజెక్టర్ ద్వారా క్షుణ్ణంగా తెలియజేశారు. పట్టణంలో జరిగిన అభివృద్ధి, స్టీల్‌బ్యాంకు, రుతుప్రేమ తదితర కార్యక్రమాల గురించి బృందం తెలుసుకుని అభినందించింది. సిద్దిపేట కోమటి చెరువు అందాలకు బృందం ముగ్ధులైంది. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాలపురం దీప్తీ నాగరాజు, డీఆర్‌డీఏ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేట స్వచ్ఛబడిలో కేంద్ర అధికారుల బృందాన్ని మొక్కను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు